


# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



*మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.*

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

## చివరి విడత: మలి సందడి (3)

**అమ్మో, నిన్న! (ఇండియా–జర్మనీ శ్రీమతి ప్రయాణ విశేషాలు – ఆమె మాటల్లోనే)**

అలారం శబ్దం విని పిల్లలు హుషారెక్కి – అదేమిటోనని చాలా కుతూహలంగా అటూ ఇటూ చూస్తున్నారు. వాళ్ల హుషారు చూసి నేను మురిసిపోయాను. కాసేపది అలా మోగుతూ ఉంటే – పిల్లలకూ, నాకూ దృష్టి మళ్లి కాలక్షేపంగా ఉంటుందని ఆశపడ్డాను.

అంతలోనే ఇద్దరు మనుషులు చటుక్కున మా దగ్గరకొచ్చారు. వాళ్లు వేసుకున్న యూనిఫాంని బట్టి విమానం తాలూకు మనుషులయుండచ్చనుకున్నాను. కానీ ఇంకా అలారం మోతకు వినోదిస్తూ వాళ్లని పట్టించుకోలేదు.

అంతలో అలారం ఆగిపోయింది. దాంతో పిల్లల హుషారుకి ఫుల్‌స్టాప్ పడింది.

ఎందుకాగిపోయిందా అనుకుంటూ అప్పుడు వచ్చినవాళ్లను చూస్తే – వాళ్లు గుచ్చి గుచ్చి నన్నే చూస్తున్నారు.

ఆ చూపులు మామూలుగా లేవు. సినిమాల్లో పోలీసులు అపరాధిని చూస్తారూ – అలా ఉన్నాయి వాళ్ల చూపులు.

వాళ్లు వచ్చింది నా కోసమే అని పించింది. ఎందుకన్నట్లు చూశాను.

వాళ్లు తమ గురించి చెప్పుకుందుకు వాడిన పదాల్ని బట్టి – విమానాశ్రయంలో సెక్యూరిటీ స్టాఫ్ అని గ్రహించాను.

ఆడ కూతురు. మగసాయం లేకుండా పిల్లలతో విమానయానం చేస్తోందని సాయానికొచ్చారా? సాయానికొస్తే ఆత్మీయంగా పలకరించాలి గానీ – ఆ చూపులేమిటి?

అప్పుడో విషయం స్ఫురించింది. ఇంగ్లీషు సినిమాల్లో నటీనటుల హావభావాల్ని బట్టి వాళ్ల ఉద్దేశ్యం తెలుసుకోవడం కష్టం. మనకి అర్థంకాని ఉచ్చారణతో ఇంగ్లీషులో ఏదో మాట్లాడేసి – ఉన్నట్లుండి ఒకరినొకరు కొట్టుకుంటారు. భాష అర్థమైతే తప్ప వాళ్లెందుకు కొట్టుకున్నారో తెలియదు.

విమానాశ్రయంలో స్టాఫ్ మనవాళ్లే ఐనా – వాళ్ల భాష, తీరు ఇంగ్లీషు వాళ్లకిలాగే ఉంటాయనుకోవాలి.

వాళ్లెలాగుంటేనేం – మన పద్ధతిలో మనముందామనుకుని వాళ్లవైపు చిరునవ్వుతో చూశాను.

వాళ్లు నాతో ఇంగ్లీషులో ఏదో అన్నారు. ఆ ఉచ్చారణ నా కర్థం కాలేదు.

అది గ్రహించారో ఏమో – వాళ్లు మళ్లీ హిందీలోకి మారారు. తుమ్, హో లాంటి పదాలు తెలిశాయి కానీ – వాళ్ల భావం తెలియలేదు.

ఆ విషయం నా మొహం చూసి గ్రహించారేమో – వాళ్లు సైగల్లోకి దిగారు.

కొన్నేళ్లుగా వేరే రాష్ట్రంలో ఉండడంవల్ల నాకు – ఇంగ్లీషు, హిందీ కూడా కొంతవరకూ అర్థమౌతాయి. కానీ వీళ్ల ఇంగ్లీషు ఉచ్చారణ అటు విదేశీయం, ఇటు దేశీయం కాకుండా మధ్యరకంగా ఉంది. హిందీ ఉచ్చారణా నా అవగాహనకు అందడం లేదు.

అలారం మోగించిందీ, ఆపిందీ కూడా వాళ్లేననీ – ఇప్పుడు వాళ్లు సామానుతో సహా మమ్మల్ని పక్కగా రమ్మంటున్నట్లు అర్థమవడానికి కాసేపు పట్టింది.

వాళ్లెందుకు పక్కకి రమ్మంటున్నారో తెలియలేదు కానీ – అలారాన్ని మరికాసేపు మ్రోగనిస్తే బాగుణ్ణనిపించింది. ఆ మాటే చెప్పేద్దును కానీ భాష సమస్య.

వాళ్లు హిందీ, ఇంగ్లీషు, సైగలు మిక్స్ చేస్తూ – నన్ను సూట్‌కేసు తెరవమన్నారు (అప్పటికి సూట్‌కేసులు తెరిచి చూపడమే కానీ ఇప్పటిలా స్కానింగ్ లేదు).

తెరవడానికి మొహమాటమేసింది. ఆ సూట్‌కేసులో మా బట్టలు – పప్పు దినుసులు, ఆవాలు, జీలకఱ్ఱ లాంటి పోపు సామాన్లు ఉన్నాయి. వాటిని చూసి వాళ్లు నవ్వుతారన్న శంకతో కొంచెం తటపటాయించాను. కానీ వాళ్లు నొక్కించడంతో తప్పలేదు.

సూట్ కేస్ తెరిచాను. అందులో వస్తువుల్ని చూసేక – వాళ్లలో ఒకడి భృకుటి ముడతలు పడింది. తనకి కావలసిందేదో దొరకలేదన్న భావం అతడి కళ్లలో చూశాను. ఇతగాడికేం కావాలి చెప్మా అని ఆలోచిస్తుండగా – హాండ్ లగేజి బ్యాగ్ తెరవమన్నాడు రెండోవాడు.

అందులో మాత్రం ఇందులో లేని అద్భుత వస్తువులేముంటాయి? కొన్ని ఆపిల్సు, పళ్లు కోసుకునే చాకు ఉన్నాయి.

సూట్‌కేసులో వాటిని చూసి నవ్వలేదు కాబట్టి, ఈసారి కాస్త ధైర్యంగానే బ్యాగ్ తెరిచాను

చాకు చూడగానే మొదటివాడికి ఇందాకటి భృకుటి ముడతలు విడిపోయాయి. నాకేసి అదోలా చూసి – ఆ చాకు దేనికోసమన్నట్లు సైగ చేశాడు.

నేను ఆపిల్సు చూపించి – వాటిని కొయ్యడానికని సైగలతో చెప్పాను.

వాళ్ల సైగలు నాకు, నా సైగలు వాళ్లకి బాగానే అర్థమయ్యాయి. ఎంత బాగా అంటే – అప్పుడు నన్నెవరైనా టైం మెషీన్లో ఆది మానవుడి కాలానికి పంపితే – అక్కడ వాళ్లతో సైగలతో ఎంతసేపైనా మేనేజ్ చేసెయ్యగలనన్న ధైర్యం వచ్చింది. కానీ ఇక్కడ ఈ అత్యాధునికులతో మాత్రం ఎంతోసేపు మేనేజ్ చెయ్యగలనని అనిపించడం లేదు.

ఇంత చక్కని సైగలుండగా – మనిషి ఎందుకు భాష నేర్చుకున్నాడో – ఇన్ని భాషలు సృష్టించి వైషమ్యాలని ఎందుకు పెంచుకుంటున్నాడో – అనిపించింది నాకా క్షణంలో.

ఆపిల్సు కొయ్యడానికి చాకు తెచ్చుకున్నాననగానే – సెక్యూరిటీ స్టాఫ్ మొహాల్లో అప్రయత్నంగా చిరునవ్వులు వెలిసాయి.

అందుకు వాళ్లకు బదులేమివ్వాలో, నేనేమంటే వాళ్లేమంటారో, ఏమర్థం చేసుకోవాలోనని కొంచెం బెంగ పడ్డాను కానీ – ఆ చిరునవ్వులే వీడ్కోలని తెలిసింది – వెంటనే వాళ్లు వెళ్లిపోవడంతో.

విమానం ఎక్కేలోగా నియోగి కనబడతాడేమోనని, అతడితో మాట్లాడ్డం కోసం ఇందాకా అలవాటైన సైగల భాషని మనసులోనే అభ్యాసం చేశాను. కానీ అంతా వృథా. ఆయన పత్తా లేదు.

అబద్ధమెందుకూ ఆయన కనబడకపోవడం నాకు కొంచెం రిలీఫ్‌గానే అనిపించింది.

ఎటొచ్చీ విమానం ఎక్కడం కొత్త కదా! ఆ సమయంలో మాత్రం అతడు కనిపించి మమ్మల్ని విమానం ఎక్కించి ఆ తర్వాత మళ్లీ మాయమైపోతే బాగుణ్ణనిపించింది.

కానీ తీరా విమానం ఎక్కే సమయానికి – ఆ హడావుడిలో నియోగి విషయం మర్చిపోయాను. ఎయిర్ హోస్టెస్ చిరునవ్వుతో అందించిన స్వాగతపూర్వక నమస్కారాన్ని స్వీకరించి, లోపల ఇతరులని గమనించగా తెలిసిందానితో మా సీట్లని వెదికి పట్టుకుని, ముగ్గురం అక్కడ కూర్చున్నాకనే మళ్లీ నాకు నియోగి గుర్తుకొచ్చాడు.

కానీ అతడికి మేము గుర్తున్నట్లు లేదు. మరి మాకు కనబడలేదు.

నేను కూడా నియోగిని చూసింది కొన్ని క్షణాలు. బుర్రలో అతడి రూపం సరిగా రిజిస్టర్ అయిందనిపించదు. కనబడితే గుర్తు పడతానన్న నమ్మకం లేదు.

ఆప్పుడో అనుమానమొచ్చింది.

పాపం నియోగి నాకు కనబడ్డాడేమో... పలకరింపుగా నావంక చూశాడేమో... అతణ్ణి గుర్తు పట్టలేక నేనతణ్ణి బ్లాంక్‌గా చూశానేమో... అందుకు నొచ్చుకుని మరి పలకరించడం మానేశాడేమో...

ఈ అనుమానం రాగానే – విమానంలో మాటవరసకి నన్ను చూసి మందహాసం చేసిన ప్రతి వ్యక్తినీ నియోగి కాదుకదా అన్న భావంతో చూశాను.

'ఆవులు పెయ్యలు మందలు జేరెను, పిట్టలు చెట్లను గుమిగూడెను, మింటను చుక్కలు మెరయుచు పొడసెను, ఇంటికి పూర్ణమ రాదాయె' అని గురజాడ వారన్నట్లు నాకు నియోగి మరి కనబడలేదు.

తర్వాతనుంచి అన్నీ కొత్త. ఇంటికొచ్చిన అతిథుల్ని మర్యాద చేసినట్లు విమానంలో మాకు చాక్లెట్లు, ఫలహారాలు, భోజనం బగైరాలు ఠంచనుగా టైముకి అందుతుంటే – ఆహా విమాన ప్రయాణమా – అనుకున్నాను.

ఏమైతేనేం – మొదటిసారి కాబట్టి కాస్త కొత్తగా అనిపించినా – విమానప్రయాణంలో ఇబ్బందులేం కలగలేదు. పిల్లల విషయానికొస్తే – వాళ్లు కొత్త వాతావరణపు మైకంలో ఉన్నారు. అన్నింటినీ ఆసక్తిగా పరికిస్తూ, నాకే ముద్దొచ్చేటంత ముచ్చటగా సద్దుకున్నారు. మొదటిసారి పిల్లల్ని బాత్రూంకి తీసుకెళ్లినప్పుడు అక్కడి వాక్యూమ్ సిస్టం అయోమయంగా అనిపించినా – పిల్లల సహకారం వల్ల ఇబ్బంది అనిపించలేదు.

అందువల్ల నియోగి అదృశ్యంవల్ల నాకొచ్చిన నష్టమేం లేదు. కనబడితే అతగాడితో ఎలా మాట్లాడాలా ఏం మాట్లాడాలా అని బెంగగా కూడా అనిపించింది. ఎందుకంటే అతను బెంగాలీ. ఇంగ్లీషు, హిందీ కూడా బెంగాలీలాగే మాట్లాడతాడు.

నా విషయంలో అతనూ అన్ని భాషలూ తెలుగులాగే మాట్లాడుతానని ఆనుకున్నాడేమో – అందుకే నాకు మళ్లీ కనబడలేదేమో అని కూడా అనుకున్నాను.

తనవుకి అలసట. మనసులో అలజడి. వీటిమధ్య తెలియకుండానే చిన్న కునుకు.

అబద్ధమెందుకూ – మాస్కో వచ్చేసిందంటే 'అప్పుడేనా?' అనుకున్నాను.

విమానం దిగుతుంటే అప్పుడు మళ్లీ స్ఫురించింది – మేము కొత్త ప్రపంచంలో అడుగెడుతున్నామని.

ఢిల్లీలోలా ఎదురుగా రంగురంగుల నేల కనిపించడం లేదు. మొత్తం ప్రకృతి తెల్లని దుప్పటి కప్పుకుని పడుకున్నట్లుంది. అది దుప్పటి కాదని తెలియడానికేమో – కొన్ని క్రేన్సు దానిమీద బలంగా దాడి చేస్తున్నాయి.

నేలంతా తెల్లని మంచు. క్రేన్సు తవ్వి పోస్తుంటే గుట్టలు గుట్టలుగా పేరుకుంటున్న మంచు. ఎంత తవ్వినా ఇంకా ఇంకా ఉన్నానంటున్న మంచు.

కొంచెం శ్రద్ధగా చూస్తే – కనుచూపు మేరలో విమానాశ్రయం కనిపిస్తోంది. నడిస్తే పది నిముషాలు పట్టొచ్చుననిపించేటంత దూరమది.

అంటే మేమిప్పుడు ఆ మంచుమీంచి నడిచి వెళ్లాలి.

నేనింకా ఆలోచిస్తుండగానే జనం ముందుకు కదిలారు. నేనూ వాళ్లని అనుసరించాను.

అప్పుడు తెలిసింది నాకు.

భుజానికి హాండ్‌బ్యాగ్ వ్రేలాడుతోంది. భుజం చుట్టూ షాల్ ఉంది. దాన్ని కప్పుతూ ఓ రగ్గుంది. ఓ చేయి చంకలో అబ్బాయిని పట్టుకుంది. మరో చేయి – నడిపించడానికి అమ్మాయిని పట్టుకుంది.

నడవాల్సింది పది నిముషాలే కావచ్చు. కానీ ఈ అవతారంతో అడుగు ముందుకు పడేదెల్లా?

ఆలోచన దారి ఆలోచనదే. నేను ముందడుగు వేశాను. అంతే!

అప్పుడు తెలిసింది. కాలికింద నేలని నున్నటి మంచు దట్టంగా కప్పేసిందనీ, నా కాళ్లకి తొడిగినది మంచుపై స్కేటింగుకి అనువైన నున్నటి షూ అనీ.

స్కేటింగ్‌ని సినిమాల్లో చూడ్డమే తప్ప, స్వయంగా చూసే అవకాశం రాలేదు. అప్పుడు మాత్రం స్వయంగా చేసే అవకాశం వచ్చింది.

అప్పుడు నాకర్థమైంది – స్కేటింగ్ అంటే జర్రున జారుతున్నప్పుడు పడిపోకుండా నిలబడి ముందుకు పోగలగడమని.

కానీ నా ముందున్నవాళ్లు స్కేటింగ్ చేస్తున్నట్లు లేదు. మామూలుగా నడుస్తున్నట్లే ఉంది.

నా వెనకున్నవాళ్లూ స్కేటింగ్ చేస్తున్నట్లు లేదు. వాళ్లు నడిరోడ్డుమీద వెనుకనుంచి మనకంటే వేగంగా వస్తూ మనని దాటించుకుని వెడుతున్నట్లుంది.

నేను మాత్రం జర్రున జారాను. అది జారడమే తప్ప నిలబడే అవకాశం లేదనిపించేటంతలా జారాను. పడిపోతున్నానని అర్థమైంది.

అప్పుడు నా గురించికంటే పిల్లలేమైపోతారోనని మాతృహృదయం తపించిపోయింది. గట్టిగా అరవబోయాను. భయమో, ఉద్వేగమో – గొంతు పెగల్లేదు.

ఐతే నేను కింద పడలేదు.

చెట్టంత తెల్లవాడొకడు నన్నే గమనిస్తున్నట్లున్నాడు. నేను జారి పడకుండా ఆపాడు. నన్ను నేను నేలమీద నిలదొక్కుకుందుకు కొద్ది క్షణాలు ఆగాడు. తర్వాత అమ్మాయిని భుజాలమీద ఎక్కించుకున్నాడు. నా బ్యాగుని తీసి ఓ భుజానికి తగిలించుకున్నాడు. అబ్బాయిని తీసుకుని చంకనెత్తుకున్నాడు. నా చెయ్యి గట్టిగా పట్టుకుని నడవమన్నట్లు కనుసైగ చేసి ముందడుగు వేశాడు.

అంతవరకూ ఎరిగున్న తెలుగు మగాళ్లకి కూడా ఒక్కసారైనా షేక్‌హాండివ్వలేదు. ఇప్పుడతడు నా చేయి పట్టుకుంటే – మగాడి చెయ్యి పట్టుకున్నట్లు లేదు. ఆసరా దొరికినట్లనిపించింది.

ఆసరాలో స్పర్శానుభూతి ఉండదు, మమతానుభూతి తప్ప – అని గ్రహించాను.

అతడి పట్టు ఎంత బలంగా ఉన్నదంటే – నా నున్నటి షూ స్కేటింగుకి మాత్రమే సహకరిస్తుంటే – ఎక్కడా జారిపడకుండానూ, నడకను మర్చిపోయీ, స్కేటింగ్ చేస్తూనే విమానాశ్రయం చేరాను.

అతను మమ్మల్ని నీడ పట్టుకు చేర్చి నా చేయి వదిలాడు. స్కేటింగు ఎంతలా అలవాటయిందంటే – అతను చేయి వదిలిన వెంటనే కొంచెం ముందుకు జారాను. అది నున్నటి మంచు నేల కాకపోవడంతో కింద పడకుండా తమాయించుకుని నిలబడి వెనక్కి తిరిగాను.

అప్పటికా చెట్టంత మనిషి – అబ్బాయినీ, అమ్మాయినీ, బ్యాగునీ క్రిందకు దించి మాకేసి చూసి చిన్న నవ్వు నవ్వాడు. ఆపద్బాంధువుల నవ్వు అలాగే ఉంటుందేమో!

చేతులు జోడించి నమస్కరించాలనుకున్నాను. కానీ నా అవయవాలేవీ ఇంకా నా స్వాధీనంలోకి రాలేదు. కనీసం థాంక్సయినా చెప్పాలనుకున్నాను. కానీ అతడు హడావుడిగా ఎటో వెళ్లిపోయాడు. తన డ్యూటీ అయిపోయిందనుకున్నాడో – లేక అతగాడి విమానం బయల్దేరడానికి సిద్ధంగా ఉందేమో!

సాయపడతానన్న నియోగి జాడ ఎక్కడా లేదు. ఇతనెవరో సమయానికి ఆపద్బాంధవుడిలా వచ్చాడు. అలాగే మాయమయ్యాడు.

ఆ మహానుభావుడికి థాంక్స్ చెప్పే అవకాశం రాలేదని మనసు బాధ పడింది. అతడి గురించే ఆలోచిస్తూ – చెట్టంత మనిషి కాబట్టి అవలీలగా మాకు సాయం చెయ్యగలిగాడు. నియోగి ఐతే నాతోపాటు తనూ పడిపోయేవాడేమో – అనుకున్నాను.

"ఆ అంకుల్ ఎంతున్నాడో" అంది అమ్మాయి కళ్లు పెద్దవి చేసుకుని.

"అవునమ్మా, చెట్టంత మనిషి" అన్నాను.

"జర్మనీ వెళ్లగానే నాన్నగారికి చెప్పాలి. నేను విమానమే కాదు, చెట్టంకుల్ భుజాలమీద కూడా ఎక్కానని" ఉత్సాహంగా అంది అమ్మాయి. మొహం చూస్తే దానికి విమానం కంటే అతడి భుజాలెక్కడమే గొప్ప విశేషంలా అనిపించింది.

చెట్టంకుల్ – భలే పేరు!

చంటిపిల్లగా ఉన్నప్పుడు ఏమో కానీ, కాస్త పెద్దయ్యేక మీరెప్పుడూ దాన్ని భుజాలమీద ఎక్కించుకోలేదు. బహుశా అది ఈ చెట్టంకుల్ని జీవితాంతం మర్చిపోదు.

అతనికి థాంక్స్ చెప్పలేకపోయానని ఇంకా మనసు నొచ్చుకుంటూనే ఉంది. మామూలుగా ఐతే అలా నొచ్చుకుంటూనే ఉండిపోయేదాన్నేమో – కానీ – నా ముందున్న గురుతర బాధ్యతలు ఆ అవకాశమివ్వలేదు!

కాస్త అటూ ఇటూ చూసి కాళీగా కనబడ్డ కుర్చీల దగ్గరికి వెళ్లాం. బ్యాగ్ దగ్గరగా పెట్టుకుని అంతా కుర్చీల్లో కూర్చున్నాం.

***( కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments